ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No: APTEL/2023/87888
శనివారం
09 ఆగస్టు 2025

ఢిల్లీని ముంచెత్తిన వాన..
200లకు పైగా విమాన సర్వీసులు ఆలస్యం

ఢిల్లీ, ఆగస్టు 9, (రిపబ్లిక్ న్యూస్): దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు ముంచెత్తాయి. నిన్న రాత్రి నుంచి కురుస్తున్న కుంభవృష్టితో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు నదులను తలపిస్తున్నాయి. శనివారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

మరోవైపు వర్షాల నేపథ్యంలో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. 200లకు పైగా విమానాలు ఆలస్యమయ్యాయి. వర్షం కారణంగా కన్నాట్ ప్యాలెస్, మథుర రోడ్డు, భారత్ మండపం తదితర ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే దాదాపు 210 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. వర్షాల నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్పోర్టు అడ్వైజరీ జారీ చేసింది. విమాన సర్వీసులకు సంబంధించి ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ తమ ఎయిర్లైన్ల నుంచి తాజా సమాచారం తెలుసుకోవాలని సూచించింది. అటు ఇండిగో, స్పైస్ జెట్ వంటి సంస్థలు కూడా అడ్వైజరీ విడుదల చేశాయి. ప్రతికూల వాతావరణం కారణంగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని, ప్రయాణికులు సహకరించాలని కోరాయి. మరోవైపు, శనివారం కూడా ఢిల్లీ వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో దేశ రాజధానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. అటు హిమాచలప్రదేశ్ సహా పలు ఉత్తరాది రాష్ట్రాల్లోనూ వర్షాలు కురుస్తున్నాయి.



ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే లక్ష్యం:సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 9, (రిపబ్లిక్ న్యూస్): అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ సోదర సోదరీమణులకు ఏపీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. రానున్న రోజుల్లో చేపట్టే కార్యక్రమాలపై వారితో చర్చించి నేడు నిర్ణయాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం:లోకేశ్

మంత్రి లోకేశ్ గిరిజనులకు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే జీవనశైలి ఆదివాసుల సొంతమన్నారు. కూటమి ప్రభుత్వంలో వారి సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తున్నామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.7,557 కోట్ల నిధులు విడుదల చేసినట్లు వివరించారు. భవిష్యత్లోనూ వారికి అన్నివిధాలా అండగా నిలుస్తామన్నారు.

ఆర్టీసీ బస్టాండ్లలో రాఖీ పండగ రద్దీ

హైదరాబాద్, ఆగస్టు 9, (రిపబ్లిక్ న్యూస్): రాఖీ పండగ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ నెలకొంది. హైదరాబాద్లోని ప్రధాన బస్టాండ్లలో రద్దీ పెరిగింది. ఎంజీబీఎస్, సికింద్రాబాద్ జేబీఎస్లో బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు. రాఖీ స్పెషల్ పేరుతో ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతోంది. ఎక్స్ప్రెస్ బస్సు సర్వీసులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఆంధ్రాకు వెళ్లే బస్సుల వద్ద జనం బారులు తీరారు. విజయవాడ బస్టాండ్లోనూ రద్దీ పెరిగింది.

పోలీసులకు రాఖీ కట్టిన హోంమంత్రి అనిత

విశాఖ, ఆగస్టు 9, (రిపబ్లిక్ న్యూస్): రక్షాబంధన్ సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు హోంమంత్రి అనిత రాఖీ కట్టి సోదరభావాన్ని వ్యక్తం చేశారు. విశాఖ ఎంవీపీ కాలనీ నుంచి ఉషోదయ జంక్షన్ వరకు ఆటోలో ప్రయాణించారు. ఆటోడ్రైవర్ గిరీశ్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు కూడా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న కానిస్టేబుల్ కొర్లయ్యను పరామర్శించి రాఖీ కట్టారు. ఆయనకు ధైర్యం చెప్పిన మంత్రి.. సహాయం అందిస్తామన్నారు.

బీసీ నేతలపై అక్రమ కేసులు పెట్టిన చరిత్ర వైకాపాది: మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి, ఆగస్టు 9, (రిపబ్లిక్ న్యూస్): నేటి నుంచి 4 రోజుల పాటు బీసీల కృతజ్ఞతా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బీసీలకు చేసిన సంక్షేమంపై చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేస్తామన్నారు. కుల సంఘాల ఆధ్వర్యంలో సీఎంకు కృతజ్ఞతలు చెబుతామని చెప్పారు. శని, ఆదివారాల్లో కల్లు గీత కార్మికులతో కృతజ్ఞత సమావేశాలు ఉంటాయన్నారు. ఈ నెల 11న చేనేత కార్మికుల ఆధ్వర్యంలో 100 అడుగుల వస్త్రాలతో ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. బీసీలకు మొదటి నుంచి గుర్తింపు ఇచ్చింది తెదేపానే అని పేర్కొన్నారు. బీసీ నేతలపై అక్రమ కేసులు పెట్టి జైల్లోకి పంపించిన చరిత్ర వైకాపాది అని విమర్శించారు

సోదరి లేని నాకు మంగళగిరి మహిళలే అక్కాచెల్లెళ్లు:నారా లోకేశ్

మంగళగిరి, ఆగస్టు 9, (రిపబ్లిక్ న్యూస్): అందరి ఆశీస్సులతో మంగళగిరిని నంబర్ 1గా తీర్చిదిద్దుతానని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సోదరి లేని తనకు మంగళగిరి మహిళలే అక్కాచెల్లెళ్లు అని అన్నారు. ఉండవల్లి నివాసంలో మంత్రికి మంగళగిరి మహిళలు పెద్ద ఎత్తున రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. రాఖీకట్టి తనకు అందించిన ఆశీస్సులు కొండంత బలాన్నిచ్చాయన్నారు. "మంగళగిరి ఆడబిడ్డలందరికీ నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. మంగళగిరిలో త్వరలోనే మరో విడత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 200 అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్, గ్యాస్ పైపైన్ల ఏర్పాటు, 100 పడకల ఆసుపత్రి, స్వర్ణకారుల కోసం జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు వంటివి పురోగతిలో ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నాం. మహా ప్రస్థానం పేరుతో శ్మశాన వాటికల నిర్మాణం, పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా మంగళగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం" అని పేర్కొన్నారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్

బుమ్రాపై వర్క్లోడ్.. వారందరి కంటే ఫిజియో ముఖ్యమా?:పాటిల్

భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా 'వర్క్ అంశం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. కొందరేమో అతడిని అన్ని మ్యాచుల్లోనూ ఆడించాలని చెబుతుండగా.. మరికొందరు మాత్రం బుమ్రాపై ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదన్నారు. టీమ్ ఇండియా క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఇప్పటికే బుమ్రా 'వర్క్ గురించి విమర్శలు గుప్పించాడు. ఇప్పుడు మరో మాజీ క్రికెటర్, మాజీ సెలక్టర్ సందీప్ పాటిల్ స్పందించాడు. బీసీసీఐ తీరు పై అసహనం వ్యక్తంచేశాడు. "బుమ్రా కొన్ని మ్యాచులు మాత్రమే ఆడాలనే నిర్ణయానికి బీసీసీఐ అంగీకరించడం నన్ను ఆశ్చర్యానికి గురిచేసింది. అంటే హెడ్ కోచ్, కెప్టెన్ కంటే ఫిజియో ముఖ్యమా? అతడు తీసుకున్న డెసిషనే ఫైనలా? మరి సెలక్టర్లు ఏం చేస్తున్నారు? అంటే సెలక్షన్ కమిటీ మీటింగ్స్లో ఫిజియో కూడా ఉంటున్నారని మేం భావించాలా? అతడే నిర్ణయం తీసుకుంటున్నాడా?. ఎప్పుడైనా సరే దేశం కోసం ఎంపికైతే.. చివరివరకూ పోరాడేందుకు సిద్ధంగా ఉండాలి. గతంలో నేను సునీల్ గావస్కర్ ఐదు రోజులూ బ్యాటింగ్ చేయడం చూశా. కపిల్దేవ్ ఎక్కువగా బౌలింగ్ చేయడమూ చూసిన రోజులు ఉన్నాయి. నెట్స్లోనూ విపరీతంగా బంతులేసేవాడు. వారెవరూ బ్రేక్ అడగలేదు. ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదు. వారంతా 16 ఏళ్లకు పైగా కెరీర్ను కొనసాగించారు. నేను కూడా 1981లో తలకు గాయమైన తర్వాత టీంలోకి వచ్చాక ఎప్పుడూ టెస్టు మ్యాచ్కు అందుబాటులో లేకుండా లేను" అని సందీప్ పాటిల్ వ్యాఖ్యానించాడు.

ముందే చెప్పాడుగా: రహానె

మరోవైపు అజింక్య రహానె మాత్రం బుమ్రాకు మద్దతుగా నిలిచాడు. టెస్టు సిరీసు ముందే బుమ్రా తాను ఆడే మ్యాచులపై స్పష్టతతో ఉన్నాడని రహానె వెల్లడించాడు. "బుమ్రా విషయంలో నాకు నచ్చింది ఇదే. అతడు ఎప్పుడూ స్పష్టతతో ఉంటాడు. సిరీస్కు ముందే.. నేను తొలి టెస్టు ఆడతా, రెండో టెస్టు ఆడను. మళ్లీ మూడో మ్యాచ్ ఆడతా.. ఇలా కెప్టెన్, మేనేజ్మెంట్కు ముందే చెప్పాడు. తనకంటే జట్టే ముఖ్యమని అతడి ఉద్దేశం. భారత జట్టుకు ఆడేటప్పుడు పక్కన కూర్చుంటానని చెప్పడం చాలా కష్టం" అని రహానె వెల్లడించాడు.

రిపబ్లిక్ సినిమా CINEMA

మహేశ్ సినిమాపై రాజమౌళి పోస్ట్..
హ్యాష్ట్యాగ్తో బిగ్ంట్..!

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఎదురుచూస్తోన్న చిత్రం #ssmb29. మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న ఈ సినిమా నుంచి నేడు అప్డేట్ వస్తుందని అభిమానులు ఆశించారు. వారిని ఉద్దేశించి దర్శకధీరుడు పోస్ట్ పెట్టారు. మహేశ్ ప్రీలుక్ ఫొటోను పంచుకున్నారు. దీని పూర్తి లుక్ను నవంబర్ లో రివీల్ చేస్తామని చెప్పారు. నేడు మహేశ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి అప్డేట్ పంచుకుంటారని ఫ్యాన్స్ భావించారు. వారిని ఉద్దేశిస్తూ రాజమౌళి ప్రత్యేక పోస్ట్ పెట్టారు. "మేం ఈ సినిమా షూటింగ్ను ఇటీవలే ప్రారంభించాం. దీనిపై మీ అందరి ఆసక్తి చూసి ఎంతో ఆనందంగా ఉంది. ఇది చాలా భారీస్థాయిలో రానుంది. కేవలం ప్రెస్మీట్ పెట్టి లేదా కొన్ని ఇమేజ్లు విడుదల చేయడం వల్ల స్టోరీకి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేము. దీన్ని భారీఎత్తున రూపొందిస్తున్నాం. నవంబర్ 2025లో మహేశ్ లుక్ను విడుదల చేస్తాం. గతంలో ఎప్పుడూ చూడనివిధంగా దీన్ని రూపొందిస్తున్నాం. మీరంతా సహకరిస్తారని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఇక ఈ పోస్టు రాజమౌళి #GlobeTrotter అనే హ్యాష్ ట్యాగ్ను జోడించారు. అంటే ఇందులో హీరోని ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ప్రయాణించే వ్యక్తిగా చూపించనున్నట్లు పరోక్షంగా చెప్పినట్లు తెలుస్తోంది. ఎన్నో ఏళ్ల తర్వాత ఈ సినిమా నుంచి అప్డేట్ వచ్చేసరికి అటు మహేశ్ అభిమానులతో పాటు ఇటు సినీ ప్రియులంతా సంబరపడుతున్నారు. దీంతో క్షణాల్లోనే ఈ హ్యాష్ ట్యాగ్ ఎక్స్లో ట్రెండింగ్లోకి వచ్చింది.

నేనూ ఎదురుచూస్తున్నా:మహేశ్ బాబు

తన పుట్టినరోజు సందర్భంగా విషెస్ చెప్పిన అభిమానులకు మహేశ్ బాబు ధన్యవాదాలు తెలిపారు. ఆయనకు విషెస్ చెప్పిన అభిమానుల నుంచి సినీ ప్రముఖుల వరకూ అందరూ #ssmb29 అప్డేట్ను కోరారు. దీంతో మహేశ్ స్పందించారు. రాజమౌళి సినిమాలో తన లుక్ కోసం తాను కూడా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 'మీలాగే నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. నవంబర్ లో మీతో పాటు నేను కూడా ఎంజాయ్ చేస్తా' అంటూ పోస్ట్ పెట్టారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

ఇంటి చిట్కాలు
వాషింగ్ మెషీన్ వాడే విషయంలో కామన్ గా చేసే తప్పులు, ఏమేం చేయకూడదో తెలుసుకోండి

వాషింగ్ మెషీన్ వాడే విషయంలో చాలా మంది కొన్ని తప్పులు చేస్తుంటారు. వీటి వల్లే మెషీన్ చాలా త్వరగా పాడైపోతుంది. మరి ఏయే తప్పులు చేయకూడదో తెలుసుకోండి.

ఇప్పుడు అందరి ఇళ్లలోనూ వాషింగ్ మెషీన్ ఉంటోంది. రెగ్యులర్ గా వాడుతూనే ఉన్నారు. ఈ మెషీన్ వచ్చిన తరవాత బట్టలు ఉతకడం చాలా సులభమైపోయింది. మెషీన్ లో వేయడం, సింపుల్ గా సెట్టింగ్స్ మార్చుకోవడం. అంతే. గంటలోపే అన్నీ శుభ్రంగా మారిపోతాయి. ఈ సౌకర్యం బాగానే ఉంది. కానీ వాషింగ్ మెషీన్ ని సరైన విధంగానే వాడుతున్నారా. ఎప్పుడైనా ఈ విషయం ఆలోచించారా. చాలా మంది ఎలా పడితే అలా వాడేస్తుంటారు. ఫలితంగా చాలా త్వరగా మెషీన్ పాడైపోతుంది. లేదా మెషీన్ నుంచి విపరీతంగా దుర్వాసన వస్తుంది. అయితే.. వాషింగ్ మెషీన్ వాడే విషయంలో చేసే కొన్ని తప్పుల వల్లే ఇలా జరుగుతుంది. మరి ఈ వాడకంలో అసలు చేయకూడని తప్పులు ఏంటి. ఎక్కువ రోజుల పాటు మన్నికగా ఉండాలంటే ఎలా వాడాలి అనే వివరాలు తెలుసుకుందాం.

ఓవర్ లోడింగ్

మెషీన్ ఉంది కదా అని చాలా మంది బట్టలు వేస్తూనే ఉంటారు. కొన్ని సార్లు ఇవి ఓవర్ లోడ్ అయిపోతాయి. నిజానికి వాషింగ్ మెషీన్ ఎన్ని బట్టల వరకూ ఓ రౌండ్ లో ఉతకగలదు అనే కెపాసిటీ ఉంటుంది. కిలోల లెక్కన దీన్ని మెన్షన్ చేస్తారు. అయితే..చాలా మంది ఈ మోతాదుకు మించి బట్టలు వేస్తుంటారు. మెషీన్ పాడైపోవడానికి మొదటి కారణం ఇదే. ఎక్కువ బట్టలు వేసినప్పుడు మెషీన్ విపరీతంగా శబ్దం చేస్తుంది. ప్రతి సారీ ఓవర్ లోడ్ చేస్తుంటే దుస్తులు సరైన విధంగా శుభ్రం కావు. అంతే కాదు. మెషీన్ పని తీరుపైనా ఇది ప్రభావం చూపిస్తుంది. మరకలు పోకపోవడం, దుర్వాసన రావడం లాంటి సమస్యలు వస్తాయి. మెషీన్ లో బట్టలు వేసినప్పుడు అవి సరైన విధంగా అటూ ఇటూ తిరిగేందుకు తప్పనిసరిగా కొంత స్పేస్ వదలాలి. అంటే బట్టలు మోతాదుకు సరిపడ మాత్రమే వేయాలి. అలా అయితేనే అవి ప్రాపర్ గా క్లీన్ అవుతాయని గుర్తుంచుకోవాలి.

డిటర్జెంట్ అతిగా వాడడం

వాషింగ్ మెషీన్ వాడకంలో ఎక్కువ మంది చేసే తప్పు డిటర్జెంట్ అతిగా వాడడం. చాలా మంది నమ్మే విషయం ఏంటంటే డిటర్జెంట్ ఎక్కువ వేస్తే ఇంకాస్త ఎక్కువ శుభ్రం అవుతాయని. కానీ దీని వల్ల ఎలాంటి ఉపయోగం లేకపోగా నష్టం జరుగుతుంది. దుస్తులపై డిటర్జెంట్ ఉండిపోతుంది. ఫలితంగా ఈ మరకలు అలాగే పట్టి ఉంచుతాయి. దుస్తులు చాలా రఫ్ గా మారిపోతాయి. మెషీన్ లో కూడా డిటర్జెంట్ ఎక్కువగా మూల మూలల్లో పేరుకుపోతుంది. దీని వల్ల చాలా త్వరగా దుర్వాసన వస్తుంది. అందుకే తయారీ సంస్థలు మెన్షన్ చేసిన విధంగా ఎంత మోతాదులో వాడాలో అంత మోతాదులోనే డిటర్జెంట్ వాడాలి. మెషీన్ మోడల్ ఆధారంగా ఇది లెక్క చూసుకుని వాడితే ఎలాంటి ఇబ్బందులు రావు.

అన్నీ కలిపి వేయడం

దుస్తులు రకరకాల కలర్స్ లో ఉంటాయి. వీటిలో కొన్ని త్వరగా రంగు పోయేవి కూడా ఉంటాయి. అలాంటి వాటిని ప్రత్యేకంగా ఉతకడం మంచిది. లేదంటే వీటి రంగు మిగతా బట్టలకు అంటుకుని పాడైపోతాయి. అంతే కాదు. లైట్ కలర్ లో ఉండే బట్టలనూ ప్రత్యేకంగానే ఉతకాలి. అంటే వీటన్నింటినీ వేరు చేసి వేరు వేరుగా మెషీన్ లో వేయడం మంచిది. ఫ్యాబ్రిక్ ఎలా ఉంది. కలర్ ఎలాంటిది అనేది గమనించుకుని అప్పుడు మెషీన్ లో వేయాలి. లేదంటే కొన్ని రకాల ఫ్యాబ్రిక్స్ చాలా త్వరగా పాడైపోతాయి. చేయితో ఉతకాల్సినవి కూడా వేరుగా పెట్టుకోవాలి. వీటిని పొరపాటున కూడా మెషీన్ లో వేయకూడదు. ఇక డెలికేట్ గా ఉండే దుస్తులనూ వేరుగానే ఉంచాలి. వీటిని ఉతకడానికి ప్రత్యేకంగా కొన్ని సెట్టింగ్స్ ఉంటాయి. వాటిని గమనించి అందుకు తగ్గట్టుగా మెషీన్ లో వేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

జేబులు చెక్ చేస్తున్నారా

హడావుడిలో ఎక్కువ మంది చేసే పొరపాటు ఏంటంటే..టకటకా అన్నీ బట్టలు తీసి మెషీన్ లో వేయడం. కానీ ప్యాంట్స్, షర్ట్స్ జేబులలో ఏమైనా ఉన్నాయా అన్నది చెక్ చేయరు. కొన్ని సార్లు టిష్యూ పేపర్స్, కాయిన్స్ లేదా ఇంకేదైనా వస్తువులు అందులోనే ఉండిపోతాయి. మెషీన్ లో వేసినప్పుడు దుస్తులన్నీ గట్టిగా పిండినట్టుగా అవుతాయి. ఫలితంగా జేబులలో వస్తువులు ఉంటే వాటి వల్ల క్లాథ్ పాడైపోతుంది. కొన్ని సార్లు ఇవి మెషీన్ ని కూడా పాడు చేసే అవకాశం ఉంటుంది. అందుకే తప్పనిసరిగా మెషీన్ లో వేసే ముందే జేబులు చెక్ చేయాలి. బాగా తడిగా ఉన్న దుస్తులను నేరుగా మెషీన్ లో వేయకూడదు. దీని వల్ల మెషీన్ అంతా దుర్వాసన వస్తుంది. ఈ వాసన మిగతా దుస్తులు కూడా అంటుకుటుంది. అందుకే కాస్తంత ఆరేసి పచ్చిదనం తగ్గిన తరవాత అప్పుడు మెషీన్లో వేయడం మంచిది.

ఈ తప్పులు కూడా

వాషింగ్ మెషీన్ లో ఉండే మరో వెసులుబాటు టెంపరేచర్ సెట్టింగ్. అంటే..వేడి నీళ్లతో కూడా శుభ్రం చేసేందుకు వీలుంటుంది. అయితే..అన్ని ఫ్యాబ్రిక్స్ కీ ఈ హాట్ టెంపరేచర్ అనేది సెట్ అవ్వదు. అందుకే..డ్రెస్ లపై ఉండే లేబుల్స్ ని జాగ్రత్తగా గమనించి అప్పుడే వేడి నీళ్లతో శుభ్రం చేసే విధంగా సెట్టింగ్ చేసుకోవాలి. వాషింగ్ మెషీన్ ని అప్పుడప్పుడైనా డీప్ క్లీన్ చేసుకోవాలి. డ్రమ్, డిటర్జెంట్ డ్రాయర్ ని తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలి. లేదంటే మరకలు అలాగే ఉండిపోతాయి. వేడి నీళ్లు, వైట్ వెనిగర్ తో వాషింగ్ మెషీన్ ని క్లీన్ చేసుకోవచ్చు. దుస్తులపై ఉండే కేర్ లేబుల్స్ ని తప్పనిసరిగా గమనించాలి. అందుకు తగ్గట్టుగానే వాటిని శుభ్రం చేయాలి.

గమనిక
ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి బాధ్యత వహించదు.